ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

ఆదివారం 15 సెప్టెంబరు 2024



ఆర్థిక సంక్షోభంలో రామగుండం కార్పొరేషన్ 6లో..

6లో.. రోజూ రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

జిల్లాపై వరాల జల్లు



పెద్దపల్లి బహిరంగసభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హాజరైన జనం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాపై వరాల జల్లు కురిపించారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి త్వరలోనే సర్వే చేయించి డీపీఆర్ రూపొందిస్తాం.. ఓదెల మండలం పొత్కపల్లి వద్ద మానేరుపై మరొక వంతెన నిర్మాణం చేపడతాం.. పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్‌లను నిర్మించి ట్రాఫిక్ సమస్యలను తగ్గిస్తాం.. పాలకుర్తిలో బండల వాగు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సబ్ స్టేషన్ మంజూరు చేస్తాం.. కాచాపూర్‌లో మహిళా సంఘాల కోసం సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం.. పైలెట్ ప్రాజెక్టు కింద నందిమేడారంలో సోలార్ పంపు సెట్లు పెడతాం.. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌కు త్వరలోనే భూమి పూజ చేస్తాం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఆయన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పర్యటించి సుమారు 100 కోట్ల రూపాయల విలువైన సబ్‌స్టేషన్లు, ఎస్ఈ భవనం, రోడ్లు, రహదారులు, ఆర్డీవో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లిలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ధర్మారంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించినన సభలు సక్సెస్ అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా పర్యటించిన భట్టి విక్రమార్క అప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ వాటిని పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చెబుతూనే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి పలు చురకలు అంటించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు, మోటార్లు నడువయని అన్న బీఆర్ఎస్ నాయకులకు చెంప దెబ్బ కొట్టేలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను రాష్ట్రంలో సరఫరా చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో తెలంగాణను పవర్ మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. 2029-30 నాటికి రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. ఒక్క అడుగు కూడా వెనక్కి వేయకుండా నిటారుగా నిలబడి రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ దేశంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేదన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమని, ప్రజాప్రభుత్వమని అన్నారు. లక్ష రూపాయల రుణ మాఫీని గత ప్రభుత్వంలో సక్రమంగా చేయకున్నా, ఆ పార్టీకి చెందిన నాయకులు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

దోపిడీ చేసే ప్రభుత్వం కాదు..

రెండు లక్షలకు పైగా రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇవ్వకున్నా కూడా వారికి కూడా చేస్తామని చెప్పామని, ఇది తమ ప్రభుత్వ కమిట్‌మెంట్ అని అన్నారు. గత పాలకుల లాగా రాష్ట్ర సంపదను దోపిడీ చేసే ప్రభుత్వం కాదని, ప్రజల ఆకాంక్షలను చట్టాలుగా మార్చే ప్రభుత్వమని అన్నారు. వ్యవసాయ రంగానికి భవిష్యత్‌లో సోలార్ పవర్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరలోనే పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో 300 గ్రామాలను ఎంపిక చేసి ఆ గ్రామంలో సాచ్యురేషన్ మోడ్‌లో అందరి రైతుల వ్యవసాయ బావులకు ప్రభుత్వమే సోలార్ పంప్‌సెట్లను, సోలార్ ప్యానళ్లను అందజేసి, పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రైతులు తమ అవసరాలకు వాడుకుంటూనే మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ధర్మారం మండలంలోని నంది మేడారం గ్రామాన్ని ఎంపిక చేస్తున్నామని ప్రకటించారు. అలాగే గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నదన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద త్వరలోనే కొన్ని గ్రామాలను ఎంపిక చేసి ఆయా గృహాలకు సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం పరికరాలను అందజే యనున్నదని చెప్పారు. సోలార్ పవర్ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపడుతు న్నామని అన్నారు. జూలపల్లి మండలం కాచా పూర్ గ్రామంలో సబ్‌స్టేషన్ ప్రారం భించుకున్న చోట మహిళలు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి 10 నుంచి 12 ఎకరాల భూమిని కేటా యించి పైలెట్ ప్రాజెక్ట స్టగా చేపడతామ న్నారు. ఆదాయాన్ని, సంపదను ఎలా సృష్టించాలో ఈ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని అన్నారు. రైతు బీమా చెల్లించామని, పంటల బీమా కూడా చేయబోతున్నా మన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు చేపట్టిన చోట భూ నిర్వాసితులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి నిధులు ఇస్తున్నామని, వారిని త్యాగధనులుగా భావిస్తున్నామని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్‌కు సర్వే చేబోతున్నామని అన్నారు. రామగుండంలో 10 వేల కోట్ల రూపాయలతో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేయను న్నామని మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

- పత్తిపాక రిజర్వాయర్‌కు త్వరలోనే సర్వే
- మానేరుపై ఓదెల మండలంలో వంతెన నిర్మాణం
- పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్ నిర్మిస్తాం
- బండల వాగు లిఫ్ట్‌కు సబ్‌స్టేషన్ మంజూరు
- నందిమేడారంలో వ్యవసాయానికి సోలార్ పంప్ సెట్లు
- కాచాపూర్‌లో మహిళలతో సోలార్ పవర్ ప్లాంట్
- రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంటుకు త్వరలో భూమి పూజ
- రూ. 100 కోట్ల పనులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భూమిపూజ
- పెద్దపల్లి, ధర్మారంలో నిర్వహించిన సభలు సక్సెస్

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదారాబాద్‌లో ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కొట్టుకుంటుంటే ఆ నెపాన్ని కాంగ్రెస్‌పై రుద్దడం సరైంది కాదన్నారు. అభివృద్ధి, సంక్షేమం తమకు రెండు కళ్ల లాంటివన్నారు. 18 వేల కోట్ల వరకు రుణ మాఫీ సొమ్మును తాము రైతుల ఖాతాల్లో జమ చేస్తే, బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేశారన్నారు. ధర్నాలు చేసిన పది మందిలో తొమ్మిది మందికి రుణ మాఫీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు మార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమ ణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జె అరుణశ్రీ, ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాక రిజర్వాయర్ నిర్మించి తీరుతాం

● ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పెద్దపల్లిటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు స్పష్టం చేశారు. పెద్దపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు చేసేందుకు వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు జండా చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 85 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామన్నారు. సబ్‌స్టేషన్లు, మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేపట్టామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చివరి ఆయకట్టు వరకు నీరందించే పత్తిపాక రిజర్వాయర్ నిర్మించి తీరుతామని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లితో పాటు సుల్తానాబాద్ బైపాస్ రోడ్డు నిర్మాణంతో పాటు మానేరుపై బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. జిల్లాలోని రైతులు, కార్మికులు, యువకులు, మహిళల సంక్షేమ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. యువత కోసం టాస్క్ సెంటర్‌ను ప్రాంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 18 వేల కోట్ల రూపాయలు పంట రుణమాఫీ చేశామన్నారు. ఇంకా కొంత మందికి సాంకేతిక లోపం వల్ల కాలేదని అది కూడా పరిష్కరించి అందరికి రుణమాఫీ ఆయ్యేలా చూస్తామన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని ఈ విడత నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

మధిర తరహాలోనే పెద్దపల్లి అభివృద్ధి చెందాలి..

● ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లిటౌన్: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిర ఏ తరహాలో అభివృద్ధి చెందుతుందో పెద్దపల్లి నియోజకవర్గానికి ఆ తరహాలోనే అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పత్తిపాక రిజర్వాయర్ బడ్జెట్‌లో నిధులు కేటాయించినందుకు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. మానేరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వల్ల జమ్మికుంటకు 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని భట్టికి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అనతికాలంలోనే నెరవేర్చుకుంటూ వస్తోందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అర్భాటం చేయదని అభివృద్ధి చేసి చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని సారయ్యగౌడ్, భూతగడ్డ సంపత్, మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, భుషనవేని సురేష్‌గౌడ్, మందల సత్యనారాయణరెడ్డి, ఎల్ రాజయ్య, సందనవేన రాజేందర్, ఉప్పు రాజు, నూగిళ్ల మల్లయ్య, బొద్దుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబరు 14: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథనిలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ సెంటిలేయన్స్ నెట్‌వర్క్ బ్రాంచ్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథనిలో కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పెద్ద పట్టణాలకే పరిమితమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలు మంథని లాంటి మారుమూల ప్రాంతానికి తరలివచ్చి బ్రాంచ్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షనీమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలను మంథని ప్రాంతానికి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. వీటి ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ బాధలు తొలిగిపోతాయన్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా మంథని ప్రాంత విద్యార్థులకు కోచింగ్ ఇప్పించి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. మంథని నియోజకవర్గంలోని యువత ఉపాధి కల్పన, ఈప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం, మౌలిక వసతుల సాధన కోసం రాజీలేకుండా ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు. ఇందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకుసాగుతామన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● **వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు..**

పట్టణంలోని పలు వినాయక మండపాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని, ఎవరూ అసౌకర్యానికి గురికావద్దన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు శశిభూషన్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న ఉపాధ్యాయులు

కాల్వ శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడటంతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం స్వీట్లు పంచుకొని ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. బదిలీ ఉత్తర్వులు కోసం సహకరించిన పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, గుండు లక్ష్మణ్, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డిలకు పీఆర్‌టీయూటీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు ముంజాల హరికృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తుందని తెలిపారు. మోడల్ స్కూల్‌లో సేవలందించిన 12 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా 13 మంది నూతన ఉపాధ్యాయులు జాయిన్ కావడం అందరికి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని తెలిపారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు అప్పాల అశోక్ కుమార్, మండల ఉపాధ్యక్షురాలు సునీత, ఉపాధ్యాయులు సుజాత, సుమలత, ప్రసాద్, చంద్రమోహన్, కిరణ్, సందీప్, పీఆర్‌టీయూటీఎస్ సీనియర్ నాయకులు నారాయణ, పీఎంటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలి

యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామగల్ల సురేష్

కాల్వ శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: మండలంలో తారుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలను వేధించిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రామగల్ల సురేష్ శనివారం ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యాబు ద్ధులు నేర్పవలసిన ఉపాధ్యాయులే విద్యార్థినులతో అసభ్యక రంగా ప్రవర్తించడం ద్వారా సమాజం తల దించుకు నే విధంగా ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్ర మం చేపడతామని ఆయన హెచ్చరించారు.

దీపం అంటుకుని ఇంట్లో మంటలు

- గోదావరిఖనిలో అగ్నిప్రమాదం

కోల్‌సిటీ, సెప్టెంబరు 14: పూజ చేసి దీపం వెలిగించి గణపతి మండపానికి వెళ్లగా దీపం అంటుకుని ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. గోదావరిఖని విఠల్‌నగర్‌లోని 13వ డివిజన్‌లో నివాసముండే మహేందర్ అనే మున్సిపల్ కార్మికుడి ఇంట్లో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. మహేందర్ భార్య పూజ చేసుకుని దేవుని పటాల వద్ద దీపం వెలిగించింది. అనంతరం గణపతి మండపం వద్దకు పూజలో పాల్గొనేందుకు వెళ్లింది. ఇదే సమయంలో దేవుడి పటాల వద్ద పెట్టిన దీపం అంటుకుని ఇంట్లో బట్టలు, సామగ్రి కాలిపోయాయి. కాంగ్రెస్ నాయకుడు చుక్కల శ్రీనివాస్, తదితరులు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. గోదావరిఖని ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్



పోలీస్ స్టేషన్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం, సెప్టెంబరు 14: ధర్మారం మండలంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పర్యటన ముగిసే వరకు నాయకులను పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. తర్వాత వారిని విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన



భూ నిర్వాసితులకు చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రి, ప్రభుత్వ విప్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 14: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శనివారం శంకుస్థాపన చేశారు. ఆర్డీవో కార్యాలయంలో అమృత్ వాటర్ కింద 25 కోట్ల 60 లక్షల రూపాయలతో పట్టణంలో తాగునీటి సౌకర్యానికి, అలాగే టీఎఫ్ఐడీసీ 30 కోట్ల నిధులతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం జెండా చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కాల వేణుగోపాల్‌రావు, నాయకులు గోపగాని సారయ్యగౌడ్, భూతగడ్డ సంపత్, మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, భుషనవేని సురేష్‌గౌడ్, మందల సత్యనారాయణరెడ్డి, ఎల్ రాజయ్య, సందనవేన రాజేందర్, ఉప్పు రాజు, నూగిళ్ల మల్లయ్య, బొద్దుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని రాఘవపూర్ గ్రామంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో కోటి 59 లక్షలతో ఎన్‌పీడీఎస్ఎల్ ఎస్ఈ భవన నిర్మాణ పనులు, అలాగే రంగాపూర్‌లో రెండు కోట్ల 35 లక్షలతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులను ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మె ల్యే చింతకుంట విజయరమణరావు, అదనపు కలెక్టర్లు శ్యామ్ ప్రసాద్‌లాల్, అరుణశ్రీ, ఆర్డీవో గంగయ్య, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు..

ధర్మారం: ధర్మారం మండలం నందిమేడారం, కటికెనపల్లి గ్రామాల్లో 33/11కెవి సబ్ స్టేషన్ల నిర్మాణాలకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం శంకుస్థాపన చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన అన్నారు. 200యూనిట్ల వరకు అర్హులైన ప్రతీ కుటుబానికి ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

● **భూ నిర్వాసితులకు చెక్కుల అందజేత**

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కింద ముంపుకు గురైన భూ నిర్వాసితులకు శనివారం ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జంబో చెక్కును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అందజేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన 125 కుటుంబాలకు రూ. 18కోట్ల చెక్కును అందజేశారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ధర్మారం గ్రామానికి తొలిసారిగా వచ్చిన మల్లు భట్టి విక్రమార్కను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వ ర్యంలో నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత నందిమేడారంలో గల నంది పంప్‌హౌస్ అతిథి గృహంలో ఇరిగేషన్ ఈఈ నూనే శ్రీధర్ ఆధ్వర్యంలో ఏఈఈలు భట్టి విక్రమార్కకు సన్మానం చేసి పుష్పగుచ్ఛం అందజేశారు.

● **మార్కెట్ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం**

ధర్మారం, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మారం మార్కెట్ చైర్మన్ రూప్లానాయక్, వెల్గటూర్ చైర్‌పర్సన్ గుండాటి గోపిక, గొల్లపల్లి చైర్మన్‌గా భీమా సంతోష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాక్కాన్‌సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి. జగిత్యాల జిల్లాల మార్కెటింగ్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధర్మారం వ్యవసాయ మార్కెట్ డెరెక్టర్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన కాంపెల్లి రాజేశంను మార్కెట్ యార్డులో పట్టణ అంబేద్కర్ సంఘం యూత్ విభాగం సభ్యులు శాలువతో శనివారం సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బొల్లి అరుణ్, గాజుల నరేష్, గందం బాణేష్, జేరిపోతుల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● **కాచాపూర్‌లో విద్యుత్ ఉపకేంద్రానికి..**

జూలపల్లి: మండలంలోని కాచాపూర్ గ్రామశివారులో నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన 132/33కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, కాంగ్రెస్ నాయకులు దారబోయిన నర్సింహాయాదవ్, మైదం వరప్రసాద్, మానుమండ్ల శ్రీనివాస్, జెట్టి సతీష్, కందుకూరి అంజయ్య, మాంకాలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

చొప్పదండి, సెప్టెంబరు 14: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు ఎల్లయ్య శుక్రవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా డయల్ 100కి ఒక వ్యక్తి ఫోన్ చేసి ముగ్గురు అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నారని ఫిర్యాదు చేశాడు. ఇద్దరు పోలీసులు గుమ్లాపూర్ వాహనంలో వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు ఎదురు కాగా గ్రామస్థులు తమను దొంగలు అనుకొని వెంటపడితే బైక్ వదిలిపెట్టి నడుచు కుంటూ వస్తున్నామని తెలిపారు. వారిద్దరిని వాహనంలో తీసుకొని గుమ్లాపూర్‌కి వెళ్లారు. అక్కడ మోటార్ సైకిల్ ఉండగా అదే సమయానికి అక్కడ కొందరు వ్యక్తులు పోలీసు లతో గొ డవకు దిగారు. అక్కడ ఉన్న కోలాపురి విజయ్ అనే వ్యక్తి పోలీసులతో దురుసుగా మా ట్లాడుతూ జీపులో ఉన్న వారిని మాకు అప్పగించాలని పోలీసులను నెట్టివేశాడు. గొడవ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోలపురి విజయ్ మీద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తేలుకాటుకు పారిశుధ్య కార్మికుడి దుర్మరణం



నల్లూరి కళ్యాణ్(ఫైల్)

ఓదెల/ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14: నిత్యం చెత్తకుప్పల మధ్య పని చేసే పారిశుధ్య కార్మికులకు గాయాలు కావడం మామూలే. అలా పని చేస్తున్న క్రమంలో తేలు కాటుకు గురై సాధారణ గాయంగా భావించి నిర్లక్ష్యం చేశాడా కార్మికుడు. విషం శరీరమంతా వ్యాపించిన తరవాత ఆస్పత్రికి వెళ్లినా ప్రయోజనం లేక పోయింది. నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయా డు. వివారాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల మం డలం పోత్కపల్లికి చెందిన నల్లూరి కళ్యాణ్ (26) రామగుండం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. 8ఇంక్లైన్ దగ్గరలో ఉన్న వెంకట్రావు పల్లి లో బుధవారం చెత్తను తొలగిస్తున్న క్రమంలో చేతికి గాయ మైంది. చెత్తలో ఉన్న ఏదో వస్తువు తగిలిందని భావించి తన పని తాను చేసుకుంటూ పోయాడు. కొది సేపటికి అతని ఆరోగ్యం విషమించడంతో చెత్తలో ఉన్న తేలు కాటు వేసినట్లు తోటి కార్మికులు గుర్తించారు. గోదావరిఖని ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా విష ప్రభావం గుండె, మెదడు వంటి శరీర అవయవాలపై చూపుతోందని గుర్తించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులుగా వైద్య చికిత్సలు చేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు శనివారం కల్యాణ్ మృతి చెందాడు. తేలు కాటును వెంటనే గుర్తించి సకాలంలో వైద్యం అంది ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని తోటి కార్మికులు వాపోతున్నారు. మృతునికి భార్య, కుమారుడున్నారు.

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 14: మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. తెల్లవారుజామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తూ వాహనాలు తనిఖీ చేయగా తాడికల్ గ్రామానికి చెందిన నరాల అంకూస్ ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 19క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. అంకూస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గొడిశాల సదానందం అనే ఆర్‌ఎంపీ డాక్టర్ శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చెల్పూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరోక ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో సదానందంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జీల పర్శరాములు ట్రాక్టర్‌లో మానేరు నుంచి జమ్మికుంటకు తరలిస్తుండగా కేసు నమోదు చేశారు.

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద బెజ్జంకి మండలం దేవక్కపల్లి నుంచి అను మతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

వీణవంక, సెప్టెంబరు 14: మండలంలోపెట్రోలింగ్ చేస్తుండగా శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ముగ్గురు వద్ద నుంచి 41,000 రూపాయల విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమెదు చేసినట్లు పేర్కొన్నారు. కొర్కల్ లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నా అంబరగొండ శ్రీనివాస్ నుంచి 7,530 రూపాయల విలువ గల మద్యం, చల్లూరులో గర్వందుల శివకృష్ణ నుంచి 32,260 రూపాయల విలువ ఉన్న, కొత్తపల్లిలో బొడిపల్లి కోటేశ్వర్ నుంచి 11,150 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

గల్ఫ్ బోర్డు, ఎన్ఆర్ఐ పాలసీపై ముందడుగు

- హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం- హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే, గల్ఫ్ ప్రభావిత ప్రాంతాల నేతలు



సమావేశం నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్ఆర్ఐ పాలసీపై ప్రభుత్వం ముందడుగు వేసి పలు కసరత్తులు నిర్వహిస్తోంది. శనివారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కన్వీనర్‌గా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు అందుబాటులో ఉన్న గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, నాయకులు, గల్ఫ్ వలసల నిపుణులు, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అభయ హస్తం ఎన్నికల మేనిఫెస్టోలో 'గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమం' పేరుతో ఇచ్చిన నాలుగు హామీల అమలుకు అవసరమైన పలు కసరత్తులను సమావేశంలో నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వర్ధన్నపేట, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు నాగరాజు, భూపతిరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, సుంకెట అన్వేష్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీహరి రావు, వెలిచాల రాజేందర్, వలస నిపుణులు అంబాసిడర్ వినోద్ కుమార్, గల్ఫ్ వలస కార్మిక నాయకులు మంద భీంరెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కథల్లో
మనిషి జీవించే హక్కులు

- కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని - 'కరీంనగర్ కథలు' సంకలనం ఆవిష్కరణ



సిరిసిల్లలో కరీంగనర్ కథల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 14 : సాహిత్యానికి పుట్టినిల్లుగా ఉన్న కరీంనగర్ ప్రాంతంలోని కవులు, రచయితుల రాసిన కథల్లో మనిషి జీవించే హక్కులు కనిపిస్తున్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ అచార్య సి.మృణాళిని అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్‌లో కరీంనగర్ కథల సంకలనం పరిచయసభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని, ప్రసిద్ధ కథా రచయిత అల్లం రాజయ్య, ప్రొఫెసర్ కాశీం, కథా సంకలనం సంపాదక వర్గం రచయితలు జూకంటి జగన్నాథం, డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్‌కుమార్, కరీంనగర్ కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచార్య మృణాళిని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో క్రీస్తుకు పూర్వం నుంచి ప్రజల భాషలో అనేక కథలు వచ్చాయన్నారు. ప్రజల భాషలో సాహిత్యం తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిందన్నారు. అనేక చారిత్రక పరిణామాలకు మనిషి జీవించే హక్కు కోసం తపించిన కథలు కరీంనగర్ కథల్లో కనిపిస్తు న్నాయన్నారు. కరీంనగర్ కథల్లో ప్రచురిం చిన ప్రతీ కథలు ప్రజల హక్కులను చూపిస్తున్నాయన్నారు. ఆ కథల్లో కవులు, రచయితలు రచించిన మాదిరిగానే ప్రజలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. ప్రముఖ రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ శతాబ్దం యుద్ధ విషాదాలనుంచి ఇక్కడ సమాజం సంఘర్షణ పడుతూనే ఉందన్నారు. 90 సంవత్సరాల కథలను సంకలనంగా కరీంనగర్ కథలను తీసుకరావడం హర్షనీయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ కాళోజీ సంకలనంలో కథలు, సాహిత్యంలో వ్యాపార సంస్కృతి ప్రబలిపోతున్న కాలంలో నిశ్శబ్దంగా నిలబడ్డాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు, రంగినేని నవీన్‌కుమార్, కవులు, రచయితలు బెజ్జారపు రవీందర్, బెజ్జారపు వినోద్‌కుమార్, అమర్, ఆడెపు లక్ష్మీపతి, రాజి రెడ్డి, దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, ఎల గొండ రవి, ఆడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం మీదికి తెచ్చిన రీల్స్ సరదా

- గూడ్స్ రైలెక్కి యువకుడి ఫొటోలు

- విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు

కాజీపేట, సెప్టెంబరు 14: రీల్స్ సరదా పిచ్చి ముదురుతోంది. ఈ సరదాలో పడి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. కాజీపేటలో ఓ యువకుడు గూడ్స్ రైలు బోగి ఎక్కి రీల్స్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే యువకుడు శనివారం కడిపికొండలో ఓ చర్చిలో జరుగుతున్న కార్యక్రమానికి హాజరయ్యాడు. కార్యక్రమం జరుగుతుండగా సమీపంలోని రాంనగర్‌లో నిలిపి ఉన్న రైలు బోగీ ఎక్కి సెల్‌ఫోన్‌లో రీల్స్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రైలుపై ఉన్న హైటెన్షన్ కరెంట్ తీగలు రాజును లాగిపడేశాయి. దీంతో కరెంట్ షాక్‌కు గురైన రాజు తీవ్రగాయాలతో బోగీ నుంచి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు.. 108కు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన 108 మెడికల్ టెక్నీషియన్ లింగాల శివకుమార్, పైలట్ కుంట రవిలు ఘటనాస్థలికి చేరుకుని ఎమర్జెన్సీ చికిత్స చేసి ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో రాజు 70 శాతం శరీరం కాలిపోయిందని ఎంజీఎం వైద్యులు తెలిపారు. స్పృహ కోల్పోయిన రాజు కుటుంబ వివరాలు తెలియాల్సి వుంది.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

గొల్లపల్లి, సెప్టెంబరు 14: దీర్ఘకాలంగా రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ధర్మారం మండల కేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సెక్యూరిటీ గార్డులు శనివారం వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీలలో 1994 సంవత్సరం నుంచి ఇప్పటివరు సెక్యూరిటీ గార్డులుగా 1200 మంది నియమితులై దాదాపు 27 సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి సేవలు చేస్తున్నామని, ఏజెన్సీ విధానం రద్దు చేస్తూ తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ నిధుల నుంచి జీతభత్యాలు చెల్లిస్తున్నందున సర్వీస్ రెగ్యులర్ చేయడం వలన ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి భారం పడదని, అనుబంధంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరి సర్వీస్‌ను రెగ్యులర్ చేశారని, వారిలాగే తమ సర్వీస్‌ను కూడా రెగ్యులర్ చేసి మా బతుకుల్లో వెలుగులు నింపి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, బొల్లం మల్లేశం, ముంజ సతీష్ గౌడ్, కిషన్ రావు, జూపాక కుమార స్వామి, జనార్దన్, హైమద్ చందు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



నృసింహుడిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 14: ధర్మపురి క్షేత్రంలో భాద్రపద మాసం ఏకాదశి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజా టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

● లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ కుటుంబ సమేతంగా సందర్శించారు. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించండి

గిత్యాల అర్బన్, సెప్టెంబరు 14: జగిత్యాల నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో ఉమ్మడి రాష్ట్రంలో నెలకొల్పబడిన సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004-2009 సంవత్సరానికి సంబంధించి మండలంలో ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా నిమిత్తం ఈ స్కీం ఏర్పాటు చేయబడిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ పథకాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా శుద్ధనీటిని సరఫరా చేస్తామని ప్రకటించి సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పక్కనపెట్టారన్నారు. అటు భగీరథ నీరుఅందక, ఇటు సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్లక్ష్యానికి గురికావడంతో మండల ప్రజలు తాగునీటికోసం వాటర్ ప్లాంట్‌ల వద్ద కొనుగోలు చేసుకుని తాగే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయికల్, జగిత్యాల మండలాల్లో రాపిడ్ స్టాండ్ ఫిల్టర్ నీటి శుద్ధి కేంద్రాల మాదిరిగానే ఇప్పుడున్న 2ఎంఎల్‌డీ ఎస్ఎస్ఎఫ్ స్థానంలో 5ఎంఎల్‌డీ ఆర్ఎస్ఎఫ్ నీటి శుద్ధి కేంద్రం నిర్మించి, బీర్‌పూర్ మండలంలోని 34 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కావున బీర్‌పూర్ మండలంలోని సీపీడబ్ల్యూఎస్ పథకాల పునరుద్ధరణకు సంబంధించి రూ.800లక్షలతో అంచనాలు రూపొందించామని, గ్రామీణ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రివైజ్డ్ అంచనాలకు అనుగుణంగా సంభందిత అంచనా నిధులు మంజూరు చేయాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయుల పనివేళలు మార్చాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 14: గురుకుల ఉపాధ్యాయుల పని వేళలను మార్చాలని యూటీఎఫ్ ఎంజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివిన్‌స్టన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు, కళాశాలలను సందర్శించి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల ప్రిన్సిపాల్స్, జేఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్స్, స్టాఫ్‌నర్స్ ప్రమోషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కుమార్, జావేద్, సభ్యులు సురేశ్‌కుమార్, జాన్సన్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తుమ్మేటి సమ్మిరెడ్డి (ఫైల్) (ఇన్‌సెట్‌లో)

జమ్మికుంట, సెప్టెంబరు 14: జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి (59) గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా మృతి చెందారు. గుండెపోటుకు గురైన సమ్మిరెడ్డిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడి నుంచి ఎదిగి రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. కాగా తుమ్మేటి సమ్మిరెడ్డి మరణ వార్త విన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తన కార్యక్రమాలను వాయిదా వేసుకోని హైదరాబాద్ నుంచి హుటాహుటిన జమ్మికుంటకు వచ్చారు. సమ్మిరెడ్డి భౌతికఖాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమ్మిరెడ్డి కుమారుడిని పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, యుప్‌టీవి సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, ప్రజా ప్రతినిధులు, ప్రముఖ రాజకీయ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మహిళా సెక్యూరిటీ గార్డ్‌పై లైంగిక వేధింపులు

- షీ టీమ్‌కు సమాచారం ఇచ్చిన బాధితురాలు- రెండు నెలల్లో రెండో ఘటన



రామగుండం మెడికల్ కళాశాల ముఖద్వారం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14: సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్)లో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపుల ఘటన మరొకటి వెలుగు చూసింది. సిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న మహిళపై సెక్యూరిటీ సూపర్‌వైజర్ గాదె సుధాకర్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అతని వేధింపులు భరించలేక బాధితురాలు షీ టీమ్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో షీటీమ్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించింది. ఘటనపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితురాలు మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోంది. సుధాకర్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. నిత్యం నానా రకాలుగా బాధితురాలిని లైంగికంగా వేధిస్తుండడంతో ఆమె ప్రిన్సిపాల్ దృష్టికి కూడా తీసుకెళ్లింది. ప్రవర్తన మారకపోవడంతో షీటీమ్‌ను ఆశ్రయించింది. జూలైలో ఇదే కళాశాలలో ఒక సూపర్‌వైజర్ పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికురాలిని లైంగికంగా వేధించిన ఘటన చోటు చేసుకుంది. అతన్ని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల్లోనే సిమ్స్‌లో రెండో ఘటన వెలుగుచూడడం గమనార్హం. గోదావరిఖని సింగరేణి మెడికల్ కళాశాలలో సెక్యూరిటీ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీగా ఉన్న సంస్థ నిర్వహణ విషయంలో మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందనే ఆరో పణలు ఉన్నాయి. పని స్థలాల్లో మహిళా కార్మికులకు రక్ష ణ, వేధింపులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సంబంధిత ఏజెన్సీదే. ఒక ఘటన జరిగిన తరువాతనైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇవేమి చేపట్టకుండా నిర్వహణను గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి.

పరస్పరదాడులు .. కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 14: పట్టణంలోని జిల్లా ఆసుపత్రి సమీపంలో వస్త్రదుకాణం ఎదుట వాహనం పార్కింగ్ ఘర్షణకు దారితీసింది. శుక్రవారం పట్టణంలో వస్త్ర దుకాణం ఎదుట కైలాస్ అనే వ్యక్తి కారు పార్క్ చేశాడు. దుకాణం ఎదుట కారు పార్క్ చేయడంతో తొలగించాలని వ్యాపారి శ్రీనివాస్ సూచించాడు. ఎందుకు తీయాలంటూ ప్రశ్నించడంతో పరస్ప రదాడులకు దారితీసింది. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు వారు ఫిర్యాదు చేశారు. కారు యజమాని కైలాస్‌పై, వస్త్రదుకాణం యజమాని శ్రీనివాస్, అతడి కుమారుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

విష జ్వరంతో విద్యార్థిని మృతి



నక్షత్రహాసిని(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 14: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మైదంశెట్టి నక్షత్రహాసిని (14) అనే విద్యార్థిని విష జ్వరంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నక్షత్రహాసిని స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట జ్వరం బారిన పడడంతో విద్యార్థినికి మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయింది. నక్షత్రహాసిని తండ్రి ఉద్యోగ రీత్యా ఎల్లారెడ్డి పేటలో ఉంటున్నప్పటికీ వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం కావడంతో మృత దేహాన్ని అక్కడికి తరలించారు.

కుక్కల స్వైర విహారం

- దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

- గ్రామస్థుల భయాందోళన



కరీంనగర్‌లో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు (ఇన్‌సెట్‌లో గాయపడ్డ చిన్నారి)

మంథని, సెప్టెంబరు 14: గ్రామాల్లో వీధి కుక్కలు రెచ్చిపోయి జనం మీద పడి విచ్చలవిడిగా దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మండలంలోని స్వర్ణపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం కుక్క స్వైర విహారం చేస్తూ దాడులు చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్వర్ణపల్లి గ్రామంలో తమ ఇంటి ముం దు ఆడుకుంటున్న నలుబోతుల మానసశ్రీ, కొరవేన వేదాన్ష్‌పటేల్ పై, మరో వ్యక్తిపై కుక్కలు విచ్చక్షణరహితంగా దాడి చేశాయి. దీంతో చిన్నారులిద్దరికి పలు చోట్ల తీవ్రంగా గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు, రక్తస్రావం అధికం కావడంతో చిన్నారుల, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం కుటుంబ సభ్యులు మంథనికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గడ్డం మల్లేష్‌తోపాటు అతడి కూతురు శ్రావ్యపై ఇదే కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత స్వర్ణపల్లి గ్రామంలో పలువురిపై దాడి చేసిన కుక్కను గ్రామస్థులు తరిమివేశారు. పక్కనే ఉన్న వెంకటాపూర్‌కు చేరుకొని తండ్రి కూతురు పై దాడి చేసింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పిచ్చకుక్కను చంపి వేశారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను పుట్ట మధు కోరారు. ఇటీవల గ్రామాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్న వీధి కుక్కలు చిన్నారులు, అందరి పై దాడులు చేస్తుండటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కల దాడుల నుంచి రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో అరకొర వైద్య సేవలు

- సెలవుల్లో వైద్యాధికారి
- పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత
- సగానికి పైగా గ్రామాల్లో మొదటి ఏఎన్ఎంలు లైని వైనం
- సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు



మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి

మల్యాల, సెప్టెంబరు 14: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యశాఖ పేర్కొంటున్నప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బంది కొరతతో గ్రామాల్లో ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాల్సి ఉండగా సగం గ్రామాల్లో ఏఎన్ఎంల కొరత నెలకొంది. దానికి తోడు పల్లె దవాఖానాలో వైద్యులు లేకపోగా మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, మండల వైద్యాధికారి సెలవులో వెళ్లారు. దీంతో గ్రామాల్లో వైద్య సేవల పర్యవేక్షణ అంతంత మాత్రమే సాగుతున్నట్లు తెలుస్తుంది. నెల రోజులుగా గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుండగా మల్యాలలోని పీహెచ్‌సీకి నిత్యం వందకు పైగా రోగులు వస్తున్నారు. ఈ క్రమంలో వైద్యుల కొరత వైద్య సేవలకు అంతరాయంగా మారుతోంది. దీంతో గ్రామాల్లోని ప్రజలు జగిత్యాల లాంటి పట్టణాలకు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెలుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అంతరాయం లేకుండా వైద్య సేవలు

వైద్యురాలు సెలవులో ఉన్నప్పటికీ పల్లె దవాఖాన వైద్యులతో రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. గ్రామాల్లో ఇద్దరేసి ఏఎన్ఎంలు ఉంటుండగా ఖాళీలు ఉన్న చోట్ల ఒకరు విధుల్లో ఉంటున్నారు. వైద్యుల కొరత దృష్ట్యా పల్లె దవాఖానాల్లో ఖాళీలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నయంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయి.

- సమీయొద్దీన్, డీఎంహెచ్‌వో

● **వైద్యులు లేని పల్లె దవాఖాలు**

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను మరింత అందుబాటులోకి తేవడంతో పాటు పెద్ద ఆసుపత్రి సేవలను అందించడానికి ఏర్పాటు చేసిన పల్లె దావాఖాల్లో వైద్యుల కొరత నెలకొంది. మండలంలో పోతారం, రాంపూర్, మ్యాడంపల్లి, తక్కళ్లపల్లి, నూకపల్లి గ్రామాల్లో పల్లెదవాఖానాలు ఉండగా తక్కళ్లపల్లి, నూకపల్లిలో వైద్యులు లేరు. ఉన్న ముగ్గురు పల్లె దవాఖాన వైద్యులే మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు.తక్కళ్లపల్లిలో స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో పల్లె దవాఖాన కొనసాగుతుంది. ఇక ఇంటింటికి అందుబాటులో ఉంటూ నిత్యం వైద్య సేవలు అందించే స్టాఫ్ నర్సులు మండల వ్యాప్తంగా 8మంది ఉండగా రాంపూర్, తాటిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి గ్రామాల్లో లేరు. దీంతో రెండవ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. మండల వైద్యాధికారి మౌనిక సెలవులో ఉండగా ప్రాథమిక ఆసుపత్రి పరిధిలో ఒక్క ఆరోగ్య పర్యవేక్షణ అధికారి పోస్టు కూడా ఖాళీ ఉంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండగట్టులో అంజన్నకు అగ్గిపెట్టెలో ఇమిడే శాలువ



అగ్గిపెట్టెలో పట్టె శాలువ అందజేస్తున్న విజయ్

మల్యాల, సెప్టెంబరు 14: సిరిసిల్లాకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ కొండగట్టు ఆంజనేయస్వామికి అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువను అందజేశాడు. శనివారం కుటుంబసమేతంగా అంజన్న సన్నిధికి వచ్చిన విజయ్‌కుమార్ స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అధికారులకు పట్టు శాలువను అందజేశారు. ఈ సం దర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ధర్మేంధర్ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీ లోకి 27,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 27,315 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 14: ఈ నెల 16న జరుగనున్న గణేష్ నిమజ్జనం సందర్భంగా శనివారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని వివిధ ఏరియాల నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తాకు విగ్రహాలు చేరుకుంటాయని, ఇక్కడి నుంచి గోదావరినదిలో నిమజ్జనం చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. చౌరస్తాలో విద్యుత్ దీపాల అలంకరణ, రోడ్లపై గుంతలను పూడ్చాలని సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విగ్రహాలకు విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరుపాలని ఆయన కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, బొంతల రాజేష్, సాగి సంతోష్‌రావు, దాసరి విజయ్, పాండురంగారావు, ఫజల్‌బేగ్, తాళ్లపల్లి యుగంధర్ ఉన్నారు.

మహా అన్నదానం

కాల్వ శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: మండలంలోని పెగడపల్లి గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శ్రీ గణేష్ యూత్ కమిటీ అధ్యక్షులు పెంట సదయ్య, ఉపాధ్యక్షులు గోపగోని పరుశరాములు, కొండ శ్రీనివాస్‌గౌడ్, పెంట రాజేశం గోపగోని శ్రీనివాస్‌గౌడ్, యూత్ నాయకులు నూనేటి కుమార్‌యాదవ్, పెంట రవి, గోపగోని శ్రీధర్, గోపగోని రామకృష్ణ, కొండ రాజు, బొంగోని రాజు, జిల అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలో రామగుండం కార్పొరేషన్

● ఖజానలో రూ.10లక్షల నిధులే.. ● 14నెలలుగా ప్రభుత్వం నుంచి పైసా రాలేదు ● సెప్టెంబరు వేతనాలకు కటకటే...



కోల్‌సిటీ, సెప్టెంబరు 14: రామగుండం నగరపాలక సంస్థ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. గత ప్రభుత్వ విధానాలతో కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం ప్రభుత్వ ఖజానాకు మళ్లింది. జూన్, 2023 నుంచి ప్రభుత్వం నుంచి పట్టణ ప్రగతి నిధులు పైసా విడుదల కాలేదు. ఆస్తి పన్ను, భవన నిర్మాణాలు, ట్రేడ్ లైసెన్స్‌లపైనే ఆధారపడాల్సి వస్తోంది. కార్పొరేషన్ ఖజానాలో నిల్వలు రూ.10 లక్షలకు పడిపోయాయి. 1వ తారీఖు వచ్చిందంటే వేతనాలు, మెయింటనెన్స్‌కు రూ.1.5కోట్లు అవసరం ఉంటాయి. సెప్టెంబరు వేతనాలు సమయానికి ఇవ్వడం గగనమయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి.

రామగుండం నగరపాలక సంస్థలో ఆదాయ మార్గాలు పెద్దగా లేకపోగా వ్యయాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. గతంలో నగరపాలక సంస్థకు స్టాంప్ డ్యూటీ, ట్రేడ్‌లైసెన్స్‌లు, ఆస్తి పన్ను, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్, ప్రొఫెషనల్ ట్యాక్స్, వీఎల్‌టీ, భవన నిర్మాణ అనుమతులు, రోడ్ కటింగ్ చార్జీలు ఇలా పలురకాల ఆదాయాలు ఉండేవి. ముఖ్యంగా జిల్లాలో ఆస్తి కొనుగోళ్లు, అమ్మకాలు ఎక్కువగా రామగుండంలోనే సాగుతాయి. స్టాంప్ డ్యూటీలో 90శాతం మున్సిపాలిటీలకే బదలాయింపబడేవి. ఒక్కో సంవత్సరం ఐదు కోట్ల రూపాయల నుంచి ఆరు కోట్ల రూపాయల వరకు స్టాంప్ డ్యూటీ ఆదాయం వచ్చేది. 2021 ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్, ప్రొఫెషన్ ట్యాక్స్‌లను ప్రభుత్వ ఖజానాకు మళ్లించుకుంది. మ్యుటేషన్ ఫీజును తగ్గించింది. దీంతో కార్పొరేషన్‌కు రెగ్యులర్ ఆదాయ వనరులు పడిపోయాయి. పలు రకాల ప్రభుత్వ గ్రాంట్లను పట్టణ ప్రగతి ద్వారా విడుదల చేస్తామని పేర్కొన్నది. 2021 ఫిబ్రవరి నుంచి పట్టణ ప్రగతి ప్రారంభం కాగా మొదట 1.25 కోట్ల రూపాయలు విడుదలయ్యేవి. 2023కు వచ్చే సరికి అవి 63లక్షల రూపాయలకు పడిపోయింది. గతంలో పట్టణప్రగతి నిధులు మంజూరు చేసినా విడుదల కాకపోవడంతో పనులు సైతం మధ్యలోనే నిలిచిపోయాయి.

● స్టాంప్ డ్యూటీ మళ్లింపుతో భారీ నష్టం..

2021 ఫిబ్రవరి నుంచి స్టాంప్ డ్యూటీని మళ్లించడంతో రామగుండానికి భారీ నష్టం జరిగింది. ఒక్క ఆర్ఎఫ్‌సీఎలే తన అవసరాల నిమిత్తం జరిపిన లావాదేవీల్లో రూ.34కోట్లు స్టాంప్ డ్యూటీ చెల్లించింది. మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు రూ.30కోట్లు జమ అయ్యే అవకాశం ఉండే. ప్రభు త్వం స్టాంప్ డ్యూటీని ఖజానాకు మళ్లించుకోవడంతో రామగుండానికి రావాల్సిన రూ.30కోట్లు రాకుండా పోయాయి. ఇవే కాకుండా ఏటా రూ.7కోట్ల మేర స్టాంప్ డ్యూటీ ప్రభుత్వ ఖజానాకు వెళ్లింది.

● ప్రతి నెలా రూ.1.5కోట్ల వ్యయం..

రామగుండం నగరపాలక సంస్థ సాధారణ నిర్వహణలో ప్రతి నెల రూ.1.5 కోట్ల వ్యయం అవుతుంది. ఇందులో పారిశుధ్య విభాగంలో పనిచేసే 448మంది కార్మికులకు రూ.70లక్షలు, కార్యాలయం, ఎలక్ట్రికల్, మంచినీటి సరఫరాలో పని చేసే 121 మంది కార్మికులకు రూ.25 లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐకి మరో రూ.30లక్షలు చెల్లిస్తారు. వాహనాల డీజిల్‌కు రూ.16 లక్షల నుంచి రూ.17 లక్షలు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యుల గౌరవ వేతనాలకు రూ.5లక్షలు, వాహనాల కిరాయిలకు రూ.3.3లక్షలు, చెల్లించాల్సి ఉంటుంది. సరాసరిగా రూ.1.5కోట్లు 1వ తేదీ వచ్చిందంటే ఖజానాలో ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నిధులు కూడా అంతర్గతంగా సమకూర్చుకుంటేనే పరిస్థితులు గట్టెక్కుతాయి.

● ట్రేడ్ లైసెన్స్‌లు, షాపింగ్ అద్దెలపై దృష్టి ఏది..

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ట్రేడ్ లైసెన్స్‌ల డిమాండ్ రూ.4కోట్ల పైనే ఉంటుంది. కానీ వసూళ్లలో మాత్రం రూ.35లక్షల నుంచి రూ.40లక్షలకే పరిమితం అవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.27లక్షలే వసూలు అయ్యాయి. రామగుండం కార్పొరేషన్‌లో చిన్న, పెద్ద ఫంక్షన్ హాళ్లే 50వరకు ఉంటాయి. రైస్ మిల్లులు, సామిల్స్, ఆసుపత్రులు, గోడౌన్‌ల నుంచి వసూళ్లు మొదలు కానట్టు తెలుస్తుంది. పెట్రోల్ బంకులు, మద్యం దుకాణాలు, బార్‌లు, వ్యాపార సముదాయాలకు సంబంధించి కొలతల్లో తేడాలు కూడా కార్పొరేషన్ ఆదాయానికి గండి పెడుతున్నాయి. దీంతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ వ్యాపార సముదాలకు సంబంధించి అద్దెలు వసూళ్లు చేయడంలో కూడా తాత్సారం చేస్తున్నారు. దీంతో కార్పొరేషన్ ఖజానాకు భారీ గండి పడుతుంది.

సాంస్కృతిక వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రచయితలు, అధ్యాపకులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 14: ప్రతీ విద్యార్థి తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే దిశలో ముందుకు నడవాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు జింకల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జిగురు రవీందర్ సూచించారు. పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కాళోజీ జయంతి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు తెలంగాణ అస్తిత్వ పోరాటంలో కాళోజీ పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు కవితలు కథలు రాయడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు సమాజాన్ని చదవాలని, సమాజంలో మీకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీతారెడ్డి, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి బుర్ర తిరుపతి, పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో కే. అక్షయ ప్రథమ బహుమతి, ఎస్. రమ్య ద్వితీయ బహుమతి, యు. మనూష తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు తెలంగాణ రచయితల వేదిక తరపున మరియు ట్రినిటి డిగ్రీ కళాశాల తరపున అభినందనలు తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐటీయూ నాయకులు

కాల్వ శ్రీరాంపూర్, సెప్టెంబరు 14: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ కాల్వశ్రీరాంపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ప్రజా పోరాటాల్లో రాటుదేలారన్నారు. అనంతరం కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారన్నారు. భారత దేశంలో దోపిడీరహిత సమసమాజం కోసం నిరంతరం శ్రమించారన్నారు. లౌకిక తత్వాన్ని, రాజ్యాంగాన్ని, ఫెడరలిజాన్ని కాపాడడానికి జరిగిన పోరాటంలో ముఖ్య భూమిక పోషించారని, చివరి శ్వాస వరకు శ్రామిక ప్రజల విముక్తి కోసం పోరాడారని అన్నారు. వారి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి, శ్రామిక ప్రజలకు, కార్మికవర్గ పోరాటాలకు తీరనిలోటని అన్నారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కాల్వశ్రీరాంపూర్ మండల నాయకులు అంబాల లక్ష్మణ్, కలవేని గట్టయ్య, చల్ల రాజయ్య, చెప్యాల మహేష్, రామస్వామి, కొమరయ్య, మధునయ్య లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

'ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలి'

మంథని, సెప్టెంబరు 14: మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేసినట్లు సింగిల్‌విండో డైరెక్టర్ రావికంటి సతీష్ శనివారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చాలా సంవత్సరాలుగా పనిచేస్తూ సింగిల్‌విండో డైరెక్టర్‌గా ఉన్న తనకు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరినట్టు తెలిపారు.

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు..అన్నదానాలు




దీపాలతో శివపార్వతుల రూపంలో అలంకరిస్తున్న మహిళలు, దీపాలతో అలంకరించిన గణపతి మండపం, పెద్దపల్లి మంత్రి, ఎమ్మెల్యేల పూజలు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 14: గోదావరిఖని పలు గణేష్ మండపాలను శనివారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సందర్శించారు. గణేష్ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. పలు డివిజన్లలో మండపాల వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంటన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, నాయకులు పెద్దెల్లిప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, అశోక్ ఉన్నారు. రమేష్‌నగర్‌లోని వాసవ్య పాఠశాలలో గణేష్ నవరాత్రుల సందర్భంగా పర్యావరణ హిత గణపతిని ఏర్పాటు చేశారు. ఆకులతో అలంకరించిన మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. 37వ డివిజన్ సంతోష్ నగర్‌లో లంబోదర యూత్ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ప్రతిమలతో దీపారాధన నిర్వహించారు. 108 ప్రసాదాలను గణనాథుని వద్ద ఉంచి పూజలు నిర్వహించారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖనిలోని వినాయక మండపాల వద్ద భారీగా అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి హాజరై గణనాథుడిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక లక్ష్మీనగర్ వ్యాపార కూడలిలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సంధ్యారాణి ప్రారంభించారు. విఠల్‌నగర్, మార్కండేయకా లనీల్లోని గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశ రు. కార్యక్రమంలో సుధీర్, సతీష్, బాలు, పద్మ, సంపూర్ణ, వ్యాపారస్థులు పాల్గొన్నారు. స్థానిక 48వ డివిజన్ మారుతీనగర్ మారుతీ మిత్ర మండలి గణేష్ మండపం వద్ద కార్పొరేటర్ విద్యా లక్ష్మణ్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదాల వితరణ నిర్వహించారు.

● గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి హైస్కూల్‌లో శనివారం రాత్రి గణపతి నవరాత్రి ఉత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థ డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

కాల్వ శ్రీరాంపూర్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామగ్రామాన గణపతి పూజ లు ఘనంగా జరిగాయి. గణపతి మండపాల వద్ద భక్తులు పూజలు చేసి భజనలు నిర్వహించారు. గణపతి మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు.

రామగిరి: మండలంలోని మారుతీనగర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపంలో ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండపంలో వినాయకుని వద్ద కొబ్బరికాయ కొట్టి అర్చకుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గొవిందు, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 54 అడుగుల మట్టి గణనాథున్ని శనివారం రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ దర్శిం చుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యే లు చింతకుంట విజయరమణరావు, మక్కాన్ సింగ్‌తో పాటు ఛత్రపతి యువసేన ప్రతినిధులు శివంగారి సతీష్, రాజేష్, శ్రవణ్‌కుమార్, రాధస్వామి, తిరుమల్ పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లతో అలంకరణ

సుల్తానాబాద్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి శనివారం రాత్రి తొమ్మిది లక్షల 99 వేల 99 రుపాయల విలువ గల కరెన్సీ నోట్లతో గణనాథున్ని అలకరించారు. మొత్తం రూ.50, 100 రుపాయల నోట్లతో గణేష్‌ని అలంకరించారు.


కరెన్సీ నోట్లతో గణనాథుని అలంకరణ

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం


నిట్టూరులో భట్టి విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు14: పెద్దపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు పెద్దపల్లి మండలం నిట్టూరులో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యే విజయరమణారావు సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ శిలారపు సత్యం, మాజీ ఎంపీటీసీ రాజయ్య, మాజీ ఉప సర్పంచ్ గిరినేని సంపత్‌రావు, ఆంజనేయ రావులతో పాటు పలువురు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పాలకుర్తి, సెప్టెంబరు 14: మండలం పరిధిలోని కుక్కలగూడూర్ గ్రామంలో శనివారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా సభ్యత్వ ప్రముఖ్ క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ..పార్లమెంటు ఎన్నికల్లో రామగుండం అసెంబ్లీలో 45 వేల 666 మంది ఓటర్లు బిజెపికి ఓట్లు వేయడం జరిగిందన్నారు.వీరిలో 40 వేల మందిని పార్టీ సభ్యులుగా చేర్చుకోవాలని రాష్ట్ర పార్టీ లక్ష్యమన్నారు.పాలకుర్తి మండలంలో పదివేల సభ్యత్వం చేయవలసిఉందని అందుకుగాను ప్రతి గ్రామంలో పోలింగ్ బూత్‌కు 200 సభ్యత్వం తప్పనిసరిగా చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఆన్‌లైన్ పద్ధతి ద్వారా సభ్యులను చేర్చుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గోపు రామయ్య, బొద్దు రాజమల్లు, శ్రీనివాస్, సత్తయ్య, హరీష్, అంజి, శంకరయ్య, మేడం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 14: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని గాంధీ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ కట్కూరి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, దాని నియంత్రణ, నివారణ మార్గాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు హెచ్ఐవీ పరీక్షలు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్, సంపత్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

పాలకుర్తి, సెప్టెంబరు 14: మండలంలోని వేంనూర్ గ్రామంలో నెలకొల్పిన గణనాథునిని మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ సేవసమితి చైర్మన్ మనాలి ఠాకూర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, సెప్టెంబరు 14: మండలంలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి జి అక్షిత అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైంది. ఆగస్టు 24న జరిగిన జిల్లాస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ సెలక్షన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల 15నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్. గిరిజ తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయ బృందం, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.జాహ్నవి, పీఈటి అంజలి తదితరులు విద్యార్థినిని అభినందించారు.



ఏరియా వర్క్‌షాప్‌లో సౌకర్యాలు కల్పించండి


డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14: ఆర్‌జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి సౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. శనివారం వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఆర్‌జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. షెడ్లు, మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. నాచగోని దశరథంగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సైదులు, అనుమ రాయమల్లు, రవీందర్, వంగ సురేష్, మసూద్‌అలీ, ప్రవీణ్, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, మొగిలి, శ్యామ్, యాదగిరి, రాజయ్య, సంపత్, వెంకటేష్, రాజేష్, మహేష్, రాకేష్, కార్మికులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అడిషనల్ సీఎంవోకు సత్కారం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 14: గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్, మెడికల్ ఆఫీసర్ ఆర్ కిరణ్‌రాజ్‌కుమార్ అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా శనివారం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఘనంగా సత్కరించింది. కిరణ్‌రాజ్‌కుమార్‌ను ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్, ఎస్సీఎస్టీ అట్రాసిటీవిజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జాతీయకార్యదర్శి కొంకటి లక్ష్మణ్, మైస రాజేష్, కాంపెల్లి సతీష్‌లు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కలువల రాజేశం, కొంకటి సిద్ధార్థ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం వేతన కోతను అంగీకరించం

రామగిరి, సెప్టెంబరు 14: వరద బాధితుల కోసం సింగరేణి కార్మికుల ఒక్కరోజు వేతన కోతను వ్యతిరేకిస్తూ శనివారం ఏపిఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావులకు పెద్దఎత్తున కార్మికులు వినతిపత్రం అందజేశారు. వరద బాధితుల కోసం విరాళాలు సేకరణలో ముందు వరుసలో ఉంటామని, కాని కార్మికుల ఒక్కరోజు వేతన కోతను అంగీకరించలేమని తెల్పి చెప్పారు. దీంతో పాటు జీఎంకు వినతి పత్రం అందజేశారు.

రోజూ రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

● రవాణా కూడా అదే స్థాయిలో జరగాలి
● విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత రానివ్వొద్దు
● ఏరియా జీఎంలతో సీఎండీ బలరాం


మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, సెప్టెంబరు 14: రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా బొగ్గు సరఫరా చేయాలని, అందు కోసం రోజూ కనీసం రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ బలరాం సూచించారు. శనివారం సింగరేణి భవన్ నుంచి ఆయన 11ఏరియా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఏరియా ఉత్పత్తిపై సమీక్ష జరిపారు. భారీ వర్షాలతో ఓసీపీల్లో ఇంకా నిలిచి ఉన్న నీటిని తక్షణమే తొలగించాలని, అవసరమైతే అదనపు పంపులు వినియోగించాలని ఆయన జీఎంలను ఆదేశించారు. రోజూ 14లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని కూడా తొలగించాలని సీఎండీ అన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో సింగరేణి తన బాధ్యతగా బొగ్గును అందించాలన్నారు. సింగరేణి ఉద్యోగులు, అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అంకిత భావంతో పనిచేయాలని ఆయన కోరారు. అయితే రక్షణ సూత్రాలను కూడా పాటించాలన్నారు. వర్షాల వల్ల మూడు మాసాల్లో తగ్గిపోయిన ఉత్పత్తిని భర్తీ చేసేందుకు కష్టపడాలని చెప్పారు. కొత్తగూడెంలోని వీకే ఓసీపీకి తొలి దశ అటవీ అనుమతులు లభించాయని, రెండు నెలల్లో ఈ ఓసీ కూడా బొగ్గు ఉత్పత్తి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జీఎంలు సూచించిన అంశాలపై సీఎండీ అప్పటికప్పుడే డైరెక్టర్లతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఈఅండ్ఎం సత్యనారాయణరావు, పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం(కోఆర్డినేషన్) సుభాని, జీఎం(సీపీపీ) జక్కం రమేష్, అన్ని ఏరియాల జీఎంలు, వివిధ విభాగాల కార్పొరేటర్ జనరల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, సెప్టెంబరు 14: భద్రతతో కూడిన ఉత్పత్తినే సంస్థ ఆశిస్తోందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. శనివారం ఆర్జీ-3 అధికారులతో ఓసీపీ-1, 2 ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఓబీ వెలికితీత లక్ష్యాలపై జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా తమ వంతు కృషి చేస్తూ, లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమష్టి కృషితోనే భవిష్యత్ లక్ష్యాలను చేరుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉపరితల గనుల్లో వర్షాకాలంలో జాగ్రత్తలను పాటిస్తూ ఉత్పత్తిని సాధించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు సెప్టెంబరు 16నుంచి 30 తేదీ వరకు, అక్టోబరు 2 నుంచి 31 వ తేదీ వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 ను సింగరేణి వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, శేఖర్‌బాబు, శ్రీనివాసులు, రఘుపతి, చంద్రశేఖర్, రాజారెడ్డి, రాజాశేఖర్, కాశీవిశ్వేశ్వర్‌రావు, జనార్దన్ రెడ్డి, సుదర్శనం, రాజేంద్రప్రసాద్, ఉదయ్‌హరిజన్, రామారావు, ఉదయ్, భాస్కర్, నాగరాజు, కళ్యాణ్, నాగేశ్వర్‌రావు, దూప్ సింగ్, శ్యామల, షబ్బిరుద్దీన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, సెప్టెంబరు 14: ఐటీఐల్లో శిక్షణ పొందిన యువతీ, యువకులకు సింగరేణి 11 ఏరియాల్లో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలు, ప్రాజెక్టు ప్రభావిత, పునరావాస గ్రామాల యువతి, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 తేదీలోపు అభ్యర్థులు ఏరియాల్లోని ఎంవీటీసీ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంస్థ లాభాలను, వాటాను వెంటనే ప్రకటించాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 14: సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను, వాటాను వెంటనే యాజమాన్యం ప్రకటించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం గడిచి ఐదు నెలల పూర్తయిన ఇప్పటి వరకు లాభాలు ఎంత వచ్చినా ప్రకటించకపోవడం సరికాదన్నారు. నెలరోజుల్లో దసరా పండుగ వస్తుందని అయినా లాభాలవాటా ఎంతో కార్మిక వర్గానికి తెలియపరచకపోవడంపై నిరాశగురవుతున్నారని పేర్కొన్నారు. గుర్తింపు కార్మిక సంఘం, ప్రాతినిధ్య సంఘం పత్రాలు రాలేదని చెప్పిన సంఘాలు ఇప్పుడు పత్రాలు తీసుకున్న తర్వాత వెంటనే లాభాలను ప్రకటించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 19న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. వరదలకు దెబ్బతిన్న ప్రాంతాలకు కార్మికుల ప్రమేయం లేకుండా బేసిక్ వేతనాన్ని కట్ చేయడానికి ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సింగరేణి సంబంధించిన ప్రభావిత ప్రాం తాలైనందున సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ ఫండ్ నుంచి ఇంకా ఎక్కువ శాతం డబ్బులు వెచ్చించి సింగరేణి యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, అయిలి శ్రీనివాస్, పర్లపెల్లి రవి, చెల్పూరి సతీష్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, కమలాకర్, రవి, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.